ప్రజాశక్తి
ఆదివారం 16 ఏప్రిల్ 2023
5
అనంతపురం



ముగిసిన పదో తరగతి పరీక్షలు

ప్రజాశక్తి-అనంతపురం సిటీ

పదో తరగతి పరీక్షలు శనివారం ముగిశాయి. ఆఖరి రోజు జిల్లావ్యాప్తంగా 139 పరీక్ష కేంద్రాల్లో 30,763 మంది హాజరు కావాల్సి ఉండగా 30,369 మంది మాత్రమే హాజరయ్యారు. 394 మంది గైర్హాజరైనట్లు డిఇఒ ఎం.సాయిరామ్, ఎసి గోవిందనాయక్ తెలిపారు. కాగా డిఇఒ ఒక కేంద్రం, ఎసి మరొక కేంద్రంతోపాటు 35 కేంద్రాలను ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు తనిఖీ చేసినట్లు తెలిపారు. మొదటిరోజు విధులు పట్ల నిర్లక్ష్యం వహించిన 8 మంది ఇన్విజిలెటర్లను సస్పెన్షన్ చేసినట్లు తెలిపారు. అదేవిధంగా పలువురు హెచ్ఎంలు, ఇన్విజిలేటర్లపై శాఖాపరమైన చర్యలు తీసుకున్నట్లు వివరించారు. ఓపెన్ స్కూల్ పరీక్షల్లో కూడా ఎలాంటి మాస్ కాపీయింగ్ జరగకుండా ప్రత్యేకంగా సిట్టింగ్, ఫ్లయింగ్ స్క్వాడ్‌లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కాగా ఈనెల 17న సాంస్కృతం రెండో పేపర్ పరీక్ష 60 సెంటర్లలో నిర్వహించనున్నట్లు డిఇఒ తెలిపారు. ఈపరీక్షకు 4,101 విద్యార్థులు హాజరుకానున్నట్లు తెలిపారు.



అనంతపురం మున్సిపల్ కార్యాలయం నుంచి డీఎస్పీ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహిస్తున్న ఉద్యోగ, ఉపాధ్యాయ జెఎసి నాయకులు

బిజెపి నేతల నోటిదురుసుపై...
పెల్లుబికిన ఆగ్రహం

◆ అనంతలో ఉద్యోగ, ఉపాధ్యాయ ఐక్య వేదిక ఆధ్వర్యంలో భారీ ర్యాలీ, నిరసన

◆ సిఐటియు మద్దతు

◆ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగానూ ఆందోళనలు

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

అనంతపురం కార్పొరేషన్ అధికారులపై బిజెపి నేతల నోటి దురుసు, దాడిపై జిల్లా వ్యాప్తంగా సర్వత్రా నిసననాగ్రహం పెల్లుబికింది. కార్పొరేషన్ కార్యాలయంలోకి వెళ్లి విధి నిర్వహణలో ఉన్న ఓ అధికారిని ఏకంగా 'బట్టలూడదీసి కొడతా' అంటూ బిజెపి నేతల బరితెగింపు వ్యాఖ్యలను అందరూ ముక్తకంఠంతో ఖండించారు. అనంతపురం కార్పొరేషన్‌లో అధికారులను దూషించిన బిజెపి నాయకులపై కేసులు నమోదు చేసి, అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ ఐక్య ఉద్యోగ, ఉపాధ్యాయ జెఎసి ఆధ్వర్యంలో శనివారం ఉదయం కార్పొరేషన్ కార్యాలయం నుంచి డీఎస్పీ కార్యాలయం వరకు నిరసన ప్రదర్శన చేపట్టారు. భారీ ర్యాలీతో డీఎస్పీ కార్యాలయం వద్దకెళ్లి అక్కడ బైటాయించి ధర్నా చేపట్టారు. వీరి ఆందోళనలకు సిఐటియు, పలు ప్రజాసంఘాల నాయకులు మద్దతు తెలిపారు. సందర్భంగా జిల్లా ఎన్జీవో సంఘం అధ్యక్షుడు చంద్రశేఖర్ రెడ్డి, సిఐటియు జిల్లా కార్యదర్శి నాగేంద్రకుమార్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ప్లాస్టిక్ నిషేధ చట్టాన్ని అమలు చేస్తున్న అనంతపురం నగర పాలక సంస్థ అధికారులను బిజెపి నాయకులు లలిత్‌కుమార్, ఫయాజ్‌లు బూతులు తిట్టడం దుర్మార్గం అన్నారు. చట్టాన్ని అమలు చేసే అధికారులను గుడ్డలూడదీసి కొడతామంటూ మాట్లాడిన తీరు సభ్యసమాజం తలదించుకునేదిలా ఉందన్నారు. ఓ వైపు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం పర్యావరణ పరిరక్షణ కోసం ప్లాస్టిక్‌ను నిషేధం విధించాలని చట్టం చేస్తుండగా, దానిని అమలు చేసేందుకు వెళ్తున్న అధికారులపై బిజెపి నాయకులు దూషనలు దాడలకు పాల్పడడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. అనంతపురంలో స్థానిక బిజెపి నేతలు నిషేధం విధించిన ప్లాస్టిక్ వస్తువులను అమ్ముతున్న వ్యాపారులతో లోపాయికారీ ఒప్పందం చేసుకున్నట్లు వారి చర్యలను బట్టి స్పష్టంగా అర్థం అవుతోందన్నారు. ఏకంగా కార్యాలయంలోనూ అధికారులను దూషిస్తున్నారంటే బిజెపి నాయకులకు చట్టం, అధికార యంత్రాంగంపై ఎలాంటి చిత్త శుద్ధి ఉందో అర్థం అవుతోందన్నారు. అధికారులపై అనుచితంగా ప్రవర్తించిన బిజెపి నాయకులపై తక్షణం కేసులు నమోదు చేసి, అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే అధికారుల పక్షాన ఆందోళనను మరింత తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. అనంతరం డీఎస్పీ కార్యాలయంలో 4వ పట్టణ సిఐ జాకీర్ హుస్సేన్‌కు వినతిపత్రం అందజేశారు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి అధికారులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. దీంతో జెఎసి నాయకులు ఆందోళన విరమించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నగర రెండవ కార్యదర్శి ఆర్‌వి.నాయుడు, సిఐటియు నగర కార్యదర్శి వెంకట నారాయణ, మూర్తుజా, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు నాగభూషణం, జిల్లా అధ్యక్షుడు ఏటీఎం నాగరాజు, ఏపీ ఎన్జీవో సంఘం జిల్లా కార్యదర్శి డి.చంద్రమోహన్, జిల్లా ఉపాధ్యక్షులు రవికుమార్, జిల్లా కోశాధికారి బషీర్ అహ్మద్, జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి ప్రవీణ్ కుమార్, సిటీ అధ్యక్ష, కార్యదర్శులు మనోహర్ రెడ్డి, శ్రీధర్‌బాబు, నగర పాలక సంస్థ డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్ రెడ్డి, ఉద్యోగులు సంగం శ్రీనివాసులు, సతీష్, యుగంధర్ రెడ్డి, వేణుగోపాల్ రెడ్డి, శ్రీకాంత్, వేణుగోపాల్, మురళి,గంగాధర్ రెడ్డితో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఉద్యోగులపై అనుచితంగా ప్రవర్తిస్తే ఉపేక్షించం : మేయర్

నగర పాలక సంస్థ ఉద్యోగులపై అనుచిత వ్యాఖ్యలు చేసిన బిజెపి నేతల చర్యలను ఉపేక్షించేది లేదని, దీనిపై పోలీసులు వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలని మేయర్ మొహమ్మద్ వసీం డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం నాడు డీఎస్పీ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న ఉద్యోగులకు సంఘీభావం తెలిపార. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్పొరేషన్ కార్యాలయంలో అధికారులపై బిజెపి నాయకులు ప్రవర్తించిన తీరు ఆక్షేపనీయం అన్నారు. ప్రజలు, నగర అభివద్ధి కోసం అధికారులు పని చేస్తున్నారన్న విషయాన్ని బిజెపి నాయకులు గుర్తించాలని చెప్పారు. ఉద్యోగుల పనితీరుపై ఏదైనా సమస్యలు ఉంటే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయాలే కానీ, ఇలా వ్యక్తిగత దూషణలు చేయడం సరికాదన్నారు. నగర పాలక సంస్థ ఉద్యోగులు పారదర్శకంగా పనిచేసేందుకు తమ పాలక వర్గం పూర్తి స్వేచ్ఛను ఇస్తోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ కార్యదర్శి సంగం శ్రీనివాసులు, హెల్త్ ఆఫీసర్ గంగాధర్ రెడ్డి, రెవెన్యూ ఆఫీసర్ సతీష్ కుమార్, కార్పొరేటర్లు అనిల్ కుమార్ రెడ్డి, ఇషాక్, కమల భూషణ్ తదితరులు పాల్గొన్నారు.

బిజెపి నాయకులను అరెస్టు చేయండి : సిపిఎం

అనంతపురం కలెక్టరేట్ : అనంతపురం మున్సిపల్ అధికారులపై దౌర్జన్యం చేసి బెదిరింపులకు దిగిన బిజెపి నాయకులను తక్షణం అరెస్ట్ చేయాలని సిపిఎం నగర 1వ కమిటీ కార్యదర్శి వి.రామిరెడ్డి డిమాండ్ చేశారు. శనివారం గణేనాయక్ భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మూడు రోజుల క్రితం అనంతపురం మున్సిపల్ కార్యాలయ అధికారిని కొంత మంది బిజెపి నాయకులు ఇష్టారీతిన మాట్లాడారన్నారు. బట్టలూడదీసి తంతామని బూతులు తిట్టడాన్ని సిపిఎం ఖండిస్తోందన్నారు. సుప్రీంకోర్టు నిబంధనల ప్రకారం ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా నిషేధించి పర్యావరణాన్ని కాపాడాలన్న ఉద్దేశంతో మున్సిపల్ అధికారులు అనంతపురంలో ప్లాస్టిక్ వస్తువులను సీజ్ చేశారన్నారు. షాప్ యజమానులు టన్నులకొద్ది ప్లాస్టిక్ కవర్‌లను షాపులలో పెట్టుకొని అమ్ముతుండడంతో పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్, మున్సిపల్ అధికారులు, పోలీసుల సహాయంతో ఆయా షాపులపై దాడి చేసి సీజ్ చేశారన్నారు. దీనిపై నగరంలో ఉన్న బిజెపి నాయకులు ఒక వర్గాన్ని రెచ్చగొట్టే విధంగా మాట్లాడడం తగదన్నారు. ఇప్పటికే దేశంలో మతాలను రెచ్చగొట్టి తమ పబ్బం గడుపుకునే బిజెపి ప్రశాంతంగా ఉన్న అనంతపురం నగరంలో కూడా ఆ విధంగా ప్రజల మధ్య ఐక్యతను దెబ్బతీసే విధంగా కుట్రలు చేయడం దుర్మార్గం అన్నారు. ప్రజల మధ్య విద్వేషాలను రగిల్చే ఇలాంట్రి కుట్రలను సిపిఎం ఆధ్వర్యంలో అడ్డుకుంటామని చెప్పారు. అధికారులపై దాడి చేసిన బిజెపి నాయకులు లలిత్‌కుమార్, ఫయాజ్‌లపై వెంటనే చట్ట పరమైన కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నగర నాయకులు వలీ, మసూద్, వెంకటేష్, నరసింహారెడ్డి, శ్రీనివాసులు, పుల్లన్న, ఎర్రిస్వామి పాల్గొన్నారు.

అడుగడుగునా కేంద్రం మోసం

◆ విభజన హామీలు ఏ ఒక్కటీ అమలు కాలేదు

◆ సెంట్రల్ యూనివర్సిటీకి నిధులు మంజూరు శూన్యం

◆ బిజెపి పాలనపై సిపిఎం, సిపిఐ నాయకుల ఆగ్రహం

◆ ప్రచారభేరిలో భాగంగా సెంట్రల్ యూనివర్సిటీ నుంచి పాదయాత్ర




సెంట్రల్ యూనివర్సిటీ నుంచి పాదయాత్రగా వస్తున్న సిపిఎం, సిపిఐ నాయకులు

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

అధికారంలోకి రాకముందు రాష్ట్రానికి అనేక హామీలను ఇచ్చిన బిజెపి నేతలు అధికారంలోకి వచ్చాక ఏ ఒక్క హామీని అమలు చేయకుండా ప్రజలను అడుగడుగునా మోసం చేసిందని సిపిఎం, సిపిఐ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. విభజన హామీలు అమలు, అనంతపురం జిల్లా బుక్కరాయసముద్రం మండలం జంతలూరు వద్ద ఉన్న ఎపి కేంద్రీయ విశ్వవిద్యాలయానికి నిధుల విడుదల్లో కేంద్రం జాప్యాన్ని నిరసిస్తూ ప్రచారభేరి పాదయాత్రను శనివారం నాడు సిపిఎం, సిపిఐ ఆధ్వర్యంలో చేపట్టారు. జంతులూరు వద్ద ఉన్న సెంట్రల్ యూనివర్సిటీ నుంచి ప్రారంభం అయిన పాదయాత్రలో సిపిఎం రాష్ట్ర నాయకులు జి.ఓబులు, సిపిఎం, సిపిఐ జిల్లా కార్యదర్శులు వి.రాంభూపాల్, జాఫర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బిజెపి పాలనలో దేశంలో ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిందన్నారు. మోడీ, అమిత్‌ల నాయకత్వంలోని బిజెపి-ఆర్ఎస్ఎస్ కూటమి ప్రజలమధ్య మత విద్వేషపు చిచ్చు రాజేస్తోందన్నారు. పేదలను విస్మరించి అంబానీ, అదానీలకు దేశ సంపదను దోచిపెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నిత్యం కరువుకాటకాలతో అల్లాడుతున్న రాయలసీమ ప్రాంత అభివృద్ధికి విభజన చట్టం మేరకు అమలు చేయాల్సిన ఏ ఒక్కటీ అమలుకు నోచుకోలేదన్నారు. సెంట్రల్ యూనివర్సిటీకి 2015లో శంకుస్థాపన చేసి ఇప్పటికి కనీసం ప్రహరీ పూర్తి చేయని పరిస్థితి ఉదంటే బిజెపికి హామీల అమలుపై ఎలాంటి చిత్తశుద్ధి ఉందో అర్థం చేసుకోవచ్చన్నారు. అనంతపురం జిల్లాలో కేంద్రీయ విశ్వవిద్యాలయం, కడప ఉక్కు పరిశ్రమ, బెల్, నాసెన్ సంస్థలు, నిమ్స్ ఏర్పాటు, బుందేల్‌ఖండ్ తరహా ప్యాకేజీ ఇలా హామీలు అన్నింటినీ తుంగలో తొక్కారన్నారు. కార్పొరేట్లకు రాయితీలు ఇస్తూ పదలపై మోయలేనంత భారాలు మోపుతోందన్నారు. గడిచిన పదేళ్ల కాలంలో నిత్యావసర వస్తువుల ధరలు భారీగా పెరిగాయన్నారు. కులం, మతం విద్వేషం, పెత్తందారీతనం మనువాద శక్తుల ఆగడాలు పేట్రేగిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. బిజెపి పాలనలో రాజ్యాంగానికి మూల స్తంభాలుగా ఉన్న ప్రజాస్వామ్యం, లౌకికతత్వం, సామాజిక న్యాయంపై దాడి జరుగుతోందన్నారు. ప్రజలను నిర్లక్ష్యం చేస్తూ పాలన సాగిస్తున్న బిజెపి ప్రజలు తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. ఈ నెల 30వరకు జరిగే ప్రచారభేరి కార్యక్రమాల్లో ప్రజలందరూ పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఓ.నల్లప్ప, బాల రంగయ్య, నాయకులు ఆర్.కుల్లాయప్ప, ముస్కిన్, పుల్లయ్య, సంజీవరెడ్డి, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి పి.నారాయణస్వామి, మల్లికార్జున, నారాయణస్వామి, రమణ, అల్లీపీర, లింగమయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రయివేటు బస్సులో మంటలు

◆ టైర్‌పగలి అగ్ని ప్రమాదం ◆ డ్రైవర్ అప్రమత్తతో ప్రయాణికులు క్షేమం



మంటల్లో కాలిపోతున్న బస్సు



కాలిపోయిన బస్సు

ప్రజాశక్తి-శింగనమల

అనంతపురం జిల్లాలో శనివారం వేకువజామున పెను ప్రమాదం తప్పింది. ప్రయాణికులతో వెళ్తున్న ఓ బస్సులో అగ్నిప్రమాదం చోటు చేసుకుని మంటలు వ్యాపించాయి. క్షణాల వ్యవధిలోన బస్సు మొత్తం కాలిపోయింది. డ్రైవర్ అప్రమత్తమైన ప్రయాణికులు అందరనీ మంటలు వ్యాపించక ముందే కిందకు దింపేయడంతో పెనుప్రమాదం తప్పింది. ప్రత్యక్ష సాక్షులు తెలిపిన మేరకు ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి... బెంగుళూరుకు చెందిన ఓవిఆర్ ట్రావెల్స్ ఎపి 39 డబ్ల్యూ 6838 నెంబర్‌గల ప్రయివేటు బస్సు 29 మంది ప్రయాణికులతో శుక్రవారం రాత్రి బెంగుళూరు నుంచి కర్నూలు జిల్లా బనగానపల్లికి బయల్దేరింది. శనివారం వేకువజామున 3-30 గంటల ప్రాంతంలో బస్సు అనంతపురం- తాడిపత్రి ప్రధాన రహదారిలోని శింగనమల చెరువు వద్దకు రాగానే వెనుకటైర్ పేలింది. వెంటనే డ్రైవర్ బస్సును పక్కన ఆపేశాడు. ఈ సమయంలో చిన్నపాటి నిప్పురవ్వలు టైర్ పేలిన ప్రాంతంలో కన్పించడంతో డ్రైవర్ వెంటనే అప్రమత్తం అయ్యి ప్రయాణికులను బస్సులో నుంచి కిందకు దింపేశాడు. ప్రయాణికులు అలా బస్సు నుంచి కిందకు దిగగానే మంటలు పూర్తిగా వ్యాపించాయి. క్షణాల వ్యవధిలో మంటలు వ్యాపించి బస్సు మొత్తం కాలిపోయింది. ప్రయాణికులు చూస్తుండగానే బస్సు మొత్తం తగలబడిపోయింది. ఈ ఘటనతో ప్రయాణికులు ఒక్కసారిగా షాక్‌కు గురయ్యారు. ప్రమాదం తప్పిపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. విషయం తెలుసుకున్న పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. అగ్నిమాపక సిబ్బంది బస్సు నుంచి ఎగిసి పడుతున్న మంటలను అదుపు చేసి, వేరే వాహనాల్లో ప్రయాణికులను వారి గమ్యస్థానాలకు చేర్చారు.

పంటల దిగుబడికి భూసార పరీక్షలు కీలకం

జిల్లా వ్యవసాయ అధికారి బి.చంద్రానాయక్



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ అధికారి బి.చంద్రానాయక్

ప్రజాశక్తి-అనంతపురం

రైతులు సాగు చేసిన పంటలకు అధిక దిగుబడులు సాధించాలంతే భూసార పరీక్షలు చాలా కీలకమని జిల్లా వ్యవసాయ అధికారి బి.చంద్రానాయక్ అన్నారు. శనివారం స్థానిక అనంత కృషి భవనంలో మండల వ్యవసాయ అధికారి వెంకటేశ్వరప్రసాద్ అధ్యక్షతన అనంతపురం రూరల్ మండల వ్యవసాయ సలహా మండలి సభ్యుల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌లో పంటల సాగుకు ముందు భూసార పరీక్షలు తప్పనిసరిగా చేయించుకోవాలన్నారు. ఇందుకోసం జిల్లావ్యాప్తంగా ఆర్‌బికె సిబ్బందికి మట్టి నమూనాల సేకరణపై శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. రైతు పొలం నుంచి సేకరించిన మట్టిని వివిధ భౌతిక, రసాయన పద్ధతుల ద్వారా విశ్లేషించి ఎంత మోతాదులో ఎరువులు వాడాలో తెలుసుకోవడమే భూసార పరీక్ష ముఖ్య ఉద్దేశమన్నారు. భూమి స్వభావాన్ని తెలుసుకుని ఎరువులు వాడితే ఎక్కువ దిగుబడులు సాధించవచ్చన్నారు. అంతేగాకుండా ఏఏ పంటలు పండిచవచ్చో కూడా తెలుసుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ సలహా మండలి అధ్యక్షులు ఆలమూరు సుబ్బారెడ్డి, ఎఆర్ఎస్ రేకులకుంట శాస్త్రవేత్త వెంకటరమణ, మండల వ్యవసాయ సలహా మండలి, ఎఇఒలు ప్రసాద్, మురళి, శిరీషా, సుజిత, ఆర్‌బికె అధికారులు, రైతులు పాల్గొన్నారు.

పక్షులను కాపాడుకుందాం : ఎస్‌కెయు విసి



పక్షుల నీటి కోసం ఏర్పాటు చేసిన కుండలను చూపుతున్న ఎస్‌కెయు విసి రామకృష్ణారెడ్డి, సిబ్బంది

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

సరైన సయంలో నీరు, ఆహారం అందించి పక్షులను కాపాడుకుందామని శ్రీకృష్ణదేవరాయ విశ్వ విద్యాలయం ఉపకులపతి మాచిరెడ్డి రామకృష్ణారెడ్డి పిలుపునిచ్చారు. శనివారం ఎస్‌కుయు ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో వేసవి సమయంలో పక్షులకు నీరు, ఆహారం అందించేందుకు చెట్ల వద్ద కుండలు ఏర్పాటు చేశారు. ఈమేరకు ఆయా కుండలు, ధాన్యపు కంకులను విసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విసి మాట్లాడుతూ పక్షుల కోసం విశ్వవిద్యాలయంలో ఉన్న చెట్లకు ఈ విధంగా ఆహారం, నీటి కుండలు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. మనుషులతో పాటు పక్షులు, జంతువులను కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌యెయు రెక్టార్ ఎ.మల్లికార్జునరెడ్డి, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డి.మురళీధర్‌రావు, బి.ఈడీ కళాశాల ప్రిన్సిపాల్ నీలకంఠాపురం సదాశివరెడ్డి, ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ రామచంద్ర, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ సోమశేఖర్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు సత్యసౌమ్య, బాల సత్యనారాయణ, చాగంటి రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఇవిఎంల గదిని పరిశీలిస్తున్న కలెక్టర్ ఎం.గౌతమి

ఇవిఎంలను పరిశీలిస్తూ ఉండాలి

కలెక్టర్ ఎం.గౌతమి

అనంతపురం కలెక్టరేట్ : ఇవిఎంలను భద్రపరిచిన గదులను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ ఉండాలని కలెక్టర్ ఎం.గౌతమి సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లాకేంద్రంలోని పాత ఆర్‌డిఓ కార్యాలయంలో భద్రపరిచిన ఎన్నికల సామగ్రిని కలెక్టర్ గౌతమి శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గదుల్లో పొడి వాతావరణం ఉండేలా చూసుకోవాలన్నారు. గోడల్లో ఏ మాత్రం చెమ్మ కనిపించినా తన దృష్టికి తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ గాయత్రిదేవి, ఎన్నికల డిప్యూటీ తహశీల్దార్ భాస్కర్, రాజకీయ పార్టీల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లు పరిశీలన

నార్పల : వసతి దీవెన పథకం ప్రారంభించడానికి ఈనెల 17న ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి మండల పర్యటనకు రానున్న నేపథ్యంలో అధికారులు ఏర్పాట్లను పరిశీలించారు. ఇందుకు సంబంధించిన సభావేదిక ఏర్పాట్లను కలెక్టర్ గౌతమి, ఎస్పీ శ్రీనివాసరావు పరిశీలించి స్థానిక అధికారులకు సలహాలు, సూచనలు ఇచ్చారు. సిఎం ఉదయం వచ్చి వివిధ కార్యక్రమాల్లో పాల్గొన్న అనంతరం మధ్యాహ్నం తిరుగు ప్రయాణం కానున్నారు. కాగా స్థానిక ప్రభుత్వ బాలుర పాఠశాల మైదానంలో ఏర్పాటు చేసిన హెలిపాడ్ వద్దకు హెలికాప్టర్ ట్రయిల్ రన్ వేసింది. హెలికాప్టర్‌ను చూసేందుకు స్థానికులు ఎగబడ్డారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ ప్రసాదరెడ్డి, ఆర్డీఓ మధుసూదన్, సిఐ అస్లార్‌బాషా, ఎస్ఐ వెంకటప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.



ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ గౌతమి, ఎస్పీ శ్రీనివాసరావు

బుద్ధి తెచ్చుకోకపోతే 'కాలవ' చరిత్ర బయటపెడతా

విప్ కాపు రామచంద్రారెడ్డి

ప్రజాశక్తి-రాయదుర్గం

మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు తనపై అనవసర అసత్య ఆరోపణలు మానుకోకపోతే ఆయన చరిత్ర అంతా బయటపెడతానని విప్ కాపు రామచంద్రారెడ్డి హెచ్చరించారు. శనివారం సాయంత్రం రాయదుర్గంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తాను గుమ్మగట్ట మండలం 75- వీరాపురం గ్రామంలో జరిగిన కార్యక్రమంలో పాల్గొంటే పచ్చ మీడియా వక్రీకరించి కనేకల్ మండలం బ్రహ్మసముద్రం గ్రామంలో జరిగినట్లు తప్పుడు ప్రసారం చేసిందన్నారు. వాస్తవమైతే ఆడియో, వీడియో ప్రసారం చూపించాలన్నారు. అనవసర డ్రామాలాడితే ప్రజలు నమ్మే స్థితిలో లేరన్నారు. తమ ప్రభుత్వ హయాంలో టిడిపి కార్యకర్తలకూ సంక్షేమ లబ్ధి చేకూరిందన్నారు. రాబోయే ఎన్నికల్లో వారి ఓటు కూడా తమకే అన్నారు. తనకు రాయదుర్గంపై ఉన్న ప్రేమాభిమానాల వల్లే అనేకమందికి ఉచిత వివాహాలు, కంటి ఆపరేషన్లు, త్రిచక్ర వాహనాల పంపిణీ, అంబులెన్స్, తాగునీటి సరఫరా, డిగ్రీ కళాశాలకు బస్సు, విద్యార్థులకు ఏడాది పాటు ఉచిత బస్‌పాస్ మొదలైన అనేక కార్యక్రమాలు చేపట్టామన్నారు. తన సొంత ఖర్చులతో పట్టణంలో వీధి దీపాలు ఏర్పాటు చేశామన్నారు. నిన్న అనంతపురంలో ఉన్న తనకు ఓమహిళ రాయదుర్గం నుంచి ఫోన్ చేసి తాగునీటి ఎద్దడి ఉందని తెలిపితే వెంటనే స్పందించి టాంకర్ ఏర్పాటు చేశామన్నారు. తాగునీరు సరఫరా చేసే ప్రధాన పైప్‌లైన్ పగిలిపోవడం వల్ల నీటి సరఫరాలో కొంత అంతరాయం కలిగిందన్నారు. ఇవన్నీ తెలియని కాలవ శ్రీనివాసులు అనవసర ఆరోపణలు చేస్తున్నారన్నారు. ఇప్పటికైనా నిరాధారమైన ఆరోపణలు చేయడం మానుకోవాలని, లేనిపక్షంలో తన బండారం అంతా బయట పెడతానని, అప్పుడు వెక్కివెక్కి ఏడవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ సమావేశంలో వైసిపి ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి బిటిపి గోవిందు, రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌని ఉపేంద్రరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి కె.మాధవరెడ్డి, వలిబాషా, శ్రీనివాస్‌యాదవ్ పాల్గొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న విప్ కాపు రామచంద్రారెడ్డి

తాగునీటి సమస్యలపై 'కాపు' నిర్లక్ష్యం

మాజీమంత్రి కాలవ శ్రీనివాసులు

ప్రజాశక్తి-రాయదుర్గం

రాయదుర్గం పట్టణ ప్రజలు గత ఎన్నికల్లో తనకు ఓటు వేయలేదన్న కక్షతోనే విప్ కాపు రామచంద్రారెడ్డి తాగునీటి సమస్యను పట్టించుకోవడం లేదని మాజీ మంత్రి, టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు కాలవ శ్రీనివాసులు మండిపడ్డారు. శనివారం కనేకల్లు రోడ్డులో ఉన్న తాగునీటి శుద్ధి ప్లాంటును స్థానిక నాయకులతో కలిసి పరిశీలించారు. అనంతరం విలేకర్లతో మాట్లాడుతూ పట్టణ ప్రజలకు అందిస్తున్న నీరు రంగుమారి, దుర్వాసన వస్తున్నా ఎమ్మెల్యే పట్టించుకోకపోవడం పూర్తిగా బాధ్యతారాహిత్యమే అవుతుందన్నారు. రాయదుర్గంలో తనకు మెజారిటీ రాలేదన్న ఉక్రోషమే ఇందుకు కారణమన్నారు. తర్వాత పట్టణంలోని 21వ వార్డులో ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఏర్పాటు చేసిన రచ్చబండలో మాట్లాడుతూ పదిరోజుల నుంచి పట్టణంలో తాగు నీరు సక్రమంగా రాకపోవడంతో ప్రజలు నానా అవస్థలు పడుతున్నారన్నారు. రెండు రోజుల నుంచి మున్సిపాలిటీ సరఫరా చేస్తున్నా దుర్గంధభరితంగా నీరు వస్తున్నట్లు మహిళలు వాపోతున్నారన్నారు. దీంతో తాగడానికి, వాడుకోవడానికి చాలా ఇబ్బందిగా ఉందని పూసల కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేశారన్నారు. సమ్మర్ స్టోరేజీ ట్యాంకులో కావాల్సినన్ని నీళ్లున్నా సక్రమంగా ప్రజలకు అందించలేని అసమర్థులు పాలకులని దుయ్యబట్టారు. జగనన్నే మా నమ్మకం అంటూ ఇళ్లకు స్టిక్కర్లు అతికించే కంటే ముందు పట్టణంలో ప్రజల మధ్యకు వచ్చి తాగునీటి సమస్యను తీర్చాలని సూచించారు. సోమవారంలోగా తాగునీటి సమస్యను పరిష్కరించాలని, లేనిపక్షంలో సోమవారంని మున్సిపాలిటీ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు నాగరాజు, జిల్లా అధికార ప్రతినిధి పురుషోత్తం, జిల్లా వాణిజ్య అధ్యక్షుడు వెంకటేశులు, నియోజకవర్గ మైనార్టీ అధ్యక్షుడు మహబూబ్ బాషా, బిసి సెల్ అధ్యక్షుడు తిప్పయ్య తదితరులు పాల్గొన్నారు.



రంగు మారిన నీటిని పరిశీలిస్తున్న మాజీమంత్రి కాలవ శ్రీనివాసులు

నేరాలు ఘోరాలు

ఉరేసుకుని యువతి ఆత్మహత్య



మృతిచెందిన టికిత

బెలుగుప్ప : కడుపునొప్పి తాళలేక టికిత (19) ఇంట్లో దూలానికి చున్నీతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన శనివారం మండలంలోని దుద్దేకుంటలో చోటు చేసుకుంది. తల్లి లక్ష్మీదేవి ఫిర్యాదు మేరకు మండల పరిధిలోని దుద్దేకుంట గ్రామానికి చెందిన గొల్ల ఆంజనేయులు, లక్ష్మీదేవి దంపతులకు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. పెద్ద కుమార్తె టికిత బీఎస్సీ సెకండియర్ జెఎన్‌టియులో చదువుతోంది. ఈనేపథ్యంలో టికిత తరచూ కడుపునొప్పితో బాధపడుతూ ఉండేది. దీంతో పలు ఆసుపత్రుల్లో చికిత్స చేయించినా ఫలితం లేకుండా పోయింది. ఈ సమస్యతో అధ్యాపకులు చెప్పే విద్యాభ్యాసం సరిగ్గా అర్థంకాక ఇంట్లోనే ఉండేది. ఈనేపథ్యంలో శనివారం తల్లిదండ్రులు పనిమీద బయటకు వెళ్లినప్పుడు కడుపునొప్పి వచ్చింది. భరించలేని టికిత చున్నీతో ఇంట్లోని దూలానికి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఇంటికొచ్చిన తల్లిదండ్రులు దూలానికి వేలాడుతున్న కూతురిని చూసి బోరున విలపించారు. సమాచారం అందుకున్న ఎస్ఐ రామకృష్ణయ్య మతదేహాన్ని పరిశీలించి పంచనామా నిమిత్తం కళ్యాణదుర్గం ఆసుపత్రికి తరలించారు. ఈమేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రాయలచెరువులో లారీ డ్రైవర్..

యాడికి : మండల పరిధిలోని రాయలచెరువు గ్రామానికి చెందిన లారీ డ్రైవర్ రామాంజనేయులు (36) ఇంట్లో ఎవరూ లేని సమయంలో చీరతో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. గమనించిన స్థానికులు వచ్చి చూసేలోగా ప్రాణాలు కోల్పోయినట్లు తెలిసింది. కాగా ఆర్థిక సమస్యలతోపాటు కుటుంబ కలహాలతో ఈ అఘాయిత్యానికి ఒడిగట్టినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. కుటుంబ సభ్యులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ గురుప్రసాద్‌రెడ్డి తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో విద్యార్థికి గాయాలు

గుత్తి : పట్టణంలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ విద్యార్థి తీవ్రంగా గాయపడ్డాడు. పట్టణానికి చెందిన విష్ణువర్ధన్ గాంధీ కూడలిలో రోడ్డు దాటుతుండగా ద్విచక్ర వాహనం ఢీకొంది. ప్రమాదంలో తీవ్రంగాయపడ్డ ఆ విద్యార్థిని చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రి తరలించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

తృటిలో తప్పిన ప్రమాదం

కళ్యాణదుర్గం : పట్టణ సమీపంలో శనివారం ఉదయం పెనుప్రమాదం తృటిలో తప్పింది. వివరాల్లోకి వెళ్తే.. రాయదుర్గం డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు కర్నూలు నుంచి రాయదుర్గం వైపు వస్తోంది. అయితే బస్సు కళ్యాణదుర్గం సమీపంలోకి రాగానే డ్రైవర్ గోపాల్ సొమ్మసిల్లి పడిపోయాడు. వెంటనే అప్రమత్తమైన ప్రయాణికులు బస్సును ఆపేశారు. అటుగా వెళ్తున్న మరో బస్సు డ్రైవర్ సాయంతో డ్రైవర్‌ను గోపాల్‌ను ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

వైసిపి ఎంపిటిసి పెద్దక్క మృతి

ఉరవకొండ : పట్టణంలోని 6వ ఎంపిటిసి పెద్దక్క (75) శనివారం గుండెపోటుతో మృతి చెందింది. పెద్దక్క ఉదయం ఇంటి ముందు పనులు చేస్తున్న సమయంలో ఒక్కసారిగా కుప్పకూలి పడిపోయింది. గమణించిన బంధువులు వెంటనే ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించినట్లు తెలిపారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి సంతాపాన్ని ప్రకటించారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. సర్పంచి లలిత, జడ్పిటిసి పార్వతమ్మ, ఎంపిపి చంద్రమ్మ, ఇతర ఎంపిటిసిలు, వైసిపి నాయకులు తమ సంతాపం వ్యక్తం చేశారు.

సీమలో రాజధానిపై లోకేష్ స్పందించాలి

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్రలోరాయలసీమలో రాజధాని, హైకోర్టు ఏర్పాటు చేయడంపై టిడిపి వైఖరిని స్పష్టం చేయాలని రాయలసీమ విమోచన సమితి అధ్యక్షుడు వై.రాజశేఖర్‌రెడ్డి డిమాండ్ చేశారు. శనివారం సంఘం కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వెనుకబడిన రాయలసీమలో రాజధాని హైకోర్టు ఏర్పాటు చేయడానికి అడుగడుగునా అడ్డుపడుతున్న లోకేష్‌కి రాయలసీమలో పాదయాత్ర చేసే అర్హత లేదన్నారు. విభజన చట్టం ప్రకారం అనంతపురం జిల్లాకు వచ్చిన ఎయిమ్స్ ఆసుపత్రిని మంగళగిరికి తరలించి కరువు జిల్లా అనంతపురం కు తీరని ద్రోహం చేసారని విమర్శించారు. రాయలసీమలో హైకోర్టు పెట్టేందుకు అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు ఊరికొక హైకోర్టు పెడతారా.. అంటూ హేళన చేశారని గుర్తు చేశారు. అలాంటి వారు ఏరకంగా రాయలసీమలో పాదయాత్ర చేస్తారని ప్రశ్నించారు. అభివృద్ధి అంతా అమరావతిలో చేయాలనుకునే వారికి రాష్ట్రం అంతా ఓట్లు ఎలా అడుగుతారన్నారు. రాయలసీమలో రాజధాని హైకోర్టు పై టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శిగా లోకేష్ తన అభిప్రాయాన్ని తెలిపి పాదయాత్ర చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రాయలసీమ విమోచన సమితి నాయకులు కోటేశ్వరరావు, జ్ఞానేశ్వర్, కాశిరావు, వైసీపీ సోసియేల్ మీడియా నాయకులు బ్రహ్మ రెడ్డి, సుబ్బు ఆచారి, దేవా తదితరులు పాల్గొన్నారు.

రస్తా సమస్య పరిష్కరించాలని వినతి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్



ఇఒఆర్‌డికి వినతిపత్రం సమర్పిస్తున్న దృశ్యం

గ్రామంలో ప్రభుత్వం కేటాయించిన భూమిలో రస్తా వేస్తుంటే గ్రామస్తుల నడమ మనస్పర్ధాలు తలెత్తి గొడవలకు దారి తీసి రస్తా ఇవ్వలేదని, పోలీసు బందోబస్తుతో రస్తా ఏర్పాటుకు సహకరించాలని అనంతపురం రూరల్ మండలం, మన్నీల సర్పంచి త్రిలోక్‌నాథ్, గ్రామస్తులు కోరారు. ఈమేరకు శనివారం ఇఒఆర్‌డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచి మాట్లాడుతూ సర్వే నెంబర్ 109, 110లో 30 అడుగుల రస్తా ప్లాన్ రికార్డు పరంగా ఉందన్నారు. సంవత్సర కాలంగా సమస్య పరిష్కారం కోరుతూ తహశీల్దార్, ఎంపిడిఒ, ఆర్‌డిఒ, జిల్లా కలెక్టర్‌లకు స్పందనలో అర్జీలు అందజేశామన్నారు. అధికారులు వచ్చి రస్తా సర్వే చేసే క్రమంలో గ్రామంలో కొంత మంది దురుసుగా మాట్లాడుతున్నారన్నారు. కావున పోలీస్ బందోబస్తు కల్పించి గ్రామంలో రస్తా వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు ఎన్.గంగాధర్, ఎన్.రాధాక్రిష్ణ, ఆంజనేయులు, సుదర్శన్‌నాయుడు, కాటమయ్య, యల్లప్ప, వీరన్న, పుల్లన్న, చక్రవర్తి, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

పుట్లూరు చెరువులకు నీరివ్వాలని వినతి

ప్రజాశక్తి-పుట్లూరు



నారాలోకేష్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న కులశేఖర్‌రెడ్డి

గండికోట నుంచి పుట్లూరు మండలంలోని పుట్లూరు, కోమటికుంట్ల, గరుగుచింతలపల్లి చెరువులకు ఎల్ఐజి-6 నుంచి లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా నీరివ్వాలని నారాలోకేష్‌కు స్థానిక నాయకులు వినతిపత్రం సమర్పించారు. కర్నూలు జిల్లాలో సాగుతున్న యువగళం పాదయాత్రలో స్థానిక నాయకులు శనివారం నారాలోకేష్‌ను కలిసి విన్నవించారు. ఈ సందర్భంగా గతనెలలో కురిసిన అకాల భారీ వడగండ్ల వర్షానికి రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. అలాగే జాజికొండ వాగుకు సిమెంట్ లైనింగ్ చేయించాలని విన్నవించారు. ఇందుకు నారాలోకేష్ స్పందిస్తూ రానున్నది తమ ప్రభుత్వమే అని టిడిపి వచ్చిన తర్వాత ఆయా సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో కోమటికుంట్ల గ్రామానికి చెందిన కులశేఖర్‌రెడ్డి అలియాస్ బాబు, తదితరులు పాల్గొన్నారు.

17 నుంచి పాలీసెట్‌కు ఉచిత శిక్షణ

ఉరవకొండ : స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఆధ్వర్యంలో ఈనెల 17వ తేదీ నుంచి పాలిసెట్‌కు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ కె.ఆసరాఫ్‌అలీ, ట్రిబుల్ ఇ శాఖాధిపతి వై.సురేష్‌బాబు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాలలో ఉన్న ఇసిఇ, ఇఇఇ కోర్సులకు విద్యార్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. ఉదయం 9:30 నుంచి మధ్యాహ్నం 1: గంటవరకు ఉరవకొండ ప్రభుత్వ ఐటిఐ కళాశాలలో శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని ఆసక్తి ఉన్న విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు




మహిళకు కరపత్రం అందజేస్తున్న ఎంపిపి సునీత

బుక్కరాయసముద్రం : వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందిస్తున్నామని ఎంపిపి సునీత తెలిపారు. శనివారం మండలంలోని పసులూరు పంచాయతీలో 'మా నమ్మకం నువ్వే జగన్' కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకోవడంతోపాటు ప్రభుత్వ పథకాలపై ఆరాతీశారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందజేస్తున్న ఘనత సిఎం జగన్‌కే దక్కుతుందన్నారు. కావున మరోసారి సిఎం జగనన్నను ఆశీర్వదించాలని విజ్ఞప్తి చేశారు. ఈకార్యక్రమంలో కన్వీనర్ బయపరెడ్డి, సర్పంచి కల్పనారెడ్డి, చిన్నపరెడ్డి, వైసిపి నాయకులు నారాయణస్వామి, రామ్మోహన్‌రెడ్డి, గృహసారథులు, వాలంటీర్లు పాల్గొన్నారు.

జీవీ చలపతి జీవితం స్ఫూర్తిదాయకం

అనంతపురం : డాక్టర్ జివి చలపతి జీవితం స్ఫూర్తిదాయకమని సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ రత్నాకర్ కొనియాడారు. శనివారం నగరంలోని ఆర్ట్స్ కళాశాలలో నూతనంగా ఏర్పాటు చేసిన జీవీ చలపతి మెమోరియల్ ప్రైమరీ హెల్త్ కేర్ సెంటర్‌ను ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ జివి చలపతి అడుగుజాడల్లో పయనించాల్సిన అవసరం ఎంతో ఉందన్నారు. వారి పేరు మీద మెమోరియల్ ప్రైమరీ హెల్త్ కేర్ సెంటర్ ఏర్పాటు చేయటం సంతోషకరంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ దివాకర్‌రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



హెల్త్ కేర్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న సత్యసాయి సెంట్రల్ ట్రస్టీ రత్నాకర్, ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

అగ్ని ప్రమాదాలపై ప్రజలకు అవగాహన

ప్రజాశక్తి-అనంతపురం

అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా రెండవ రోజు శనివారం నగరంలోని సప్తగిరి సర్కిల్, తాడిపత్రి బస్టాండ్, శ్రీకంఠం సర్కిల్, ఆర్టీసీ బస్టాండ్, టవర్ క్లాక్ తదితర ప్రాంతాల్లో అగ్నిమాపక సిబ్బంది అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా సహాయక అగ్నిమాపక అధికారి అశ్వర్థ మాట్లాడుతూ వేసవిలో ప్రజలు ఎంతో అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎలాంటి చిన్న ప్రమాదం జరిగిన తగిన జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఎంతో ఉందన్నారు. సరైన అవగాహన ప్రజల్లో ఉంటే ప్రమాదాలను అరికట్టడం సాధ్యమవుతుందన్నారు. ఈ నేపథ్యంలో నగరంలో నీటిని ఉపయోగించి పలు విన్యాసాలు చేసి ప్రయోగాత్మకంగా వివరించారు. అలాగే గ్యాస్, గడ్డివాములు కాలం వంటి ప్రమాదాలు సంభవించినప్పుడు ఎలా చేయాలో అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఉరవకొండ : పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణంలో అగ్నిప్రమాదాలపై ఫైర్‌స్టేషన్ అధికారి ఎ.లింగమయ్య ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ఇందులో భాగంగా ఎలక్ట్రికల్, ఆయిల్ గ్యాస్, పంటలకు అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు నివరించారు. అదేవిధంగా మానవ జీవన ప్రదేశాల్లో అగ్ని ప్రమాదాల జరిగితే తీసుకోవాల్సిన జాగ్రత్తలకు సంబంధించిన కరపత్రాలను ప్రజలకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డిపో మేనేజర్ బాలాజీ దయాల్, ఆర్టీసీ, ఫైర్‌స్టేషన్ సిబ్బంది, ప్రజలు, ప్రయాణికులు, తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలు పంపిణీ చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

ఇంటి పట్టాలివ్వకపోవడం దుర్మార్గం : టిడిపి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ఎన్నికల ముందు అర్హులందరికీ ఇళ్ల పట్టాలు ఇస్తామని గొప్పలు చెప్పిన వైసిపి ప్రభుత్వం ఇంత వరకు ఇవ్వకపోవడం దుర్మార్గమని టిడిపి జిల్లా అధికార ప్రతినిధి సరిపూటి రమణ విమర్శించారు. శనివారం టిడిపి ఆధ్వర్యంలో నగరంలోని 19వ డివిజన్‌లో ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ వైఫల్యాలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నిత్యావసర వస్తువుల ధరలు పెరిగాయని, కనీసం ఇంటి అద్దెలు చెల్లించలేని దుస్థితిలో ప్రజలు ఉన్నారని తెలిపారు. విద్యుత్ చార్జీల పెంచి భారాల మోతా మోగిస్తున్నారని విమర్శించారు. వైసిపి స్టిక్కర్లు అతికించే సమయంలో ప్రజలు వ్యతిరేకిస్తున్నా బలవంతంగా స్టిక్కర్‌లు అతికిస్తున్నారని ప్రజలు వాపోతున్నారని తెలిపారు. రాబోయే ఎన్నికల్లో టిడిపిని గెలిపించేందుకు ప్రజలు సిద్ధం కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా అధికార ప్రతినిధి నారాయణస్వామి యాదవ్, డివిజన్ అధ్యక్షురాలు లక్ష్మీదేవమ్మ, మాజీ కార్పొరేటర్ రాజారావు, గుర్రం నాగభూషణం, ముక్తియార్, నాయకులు బొమ్మినేని శివ, పావురాల శేఖర, ఓబులరెడ్డి, గంగవరం బుజ్జి, మనోహర్, పూల బాషా పాల్గొన్నారు.

నార్పల : ద్విసభ్య కమిటీ సభ్యులు ఆలం నరసానాయుడు, ముంటిమడుగు కేశవరెడ్డి ఆదేశాల మేరకు శనివారం మండలంలోని నడిమిదొడ్డి గ్రామంలో టిడిపినాయకులు ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా నాయకులు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ వైఫల్యాలను వివరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం రాష్ట్రంలో దుర్మార్గపు పాలన సాగిస్తోందన్నారు. దీంతో ప్రజలందరూ అష్టకష్టాలు పడుతున్నారు. కావున రానున్న ఎన్నికల్లో టిడిపి గెలిపించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కన్వీనర్ ఎర్రినాగప్ప, క్లస్టర్ ఇన్‌ఛార్జిలు లక్ష్మీనారాయణ, కుళ్లాయప్ప, బొగ్గు నారాయణస్వామి, సర్పంచి బొగ్గు నాగర్జున, చంద్రమోహన్‌రెడ్డి, గ్రామ కమిటీ అధ్యక్షుడు నల్లప్ప, పెద్దనల్లప్ప, అమర్నాథ్, ఈశ్వర్‌రెడ్డి, మునిస్వామి, శ్రీనివాసులు, రామాంజి, నాగరాజు, రాము, పెద్ద లక్ష్మీనారాయణ, యర్రన్న, తలారి నల్లమ్మ, నారాయణమ్మ, తులశమ్మ, టిడిపి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

నియంత్రణ లేకుండా మూత్రవిసర్జనకు చికిత్స

40 ఏళ్ల మహిళకు నాలుగేళ్లుగా సమస్య - అత్యాధునిక శస్త్రచికిత్సతో నయం చేసిన కిమ్స్ సవీరా వైద్యులు

ప్రజాశక్తి-అనంతపురం

నవ్వినా, దగ్గినా, తుమ్మినా కాసేపు వ్యాయామం చేస్తున్నా.. ఉన్నట్టుండి నియంత్రణ లేకుండా మూత్రవిసర్జన కావడం అనేది కొందరు మహిళల్లో కనిపించే సమస్య. దీన్నే వైద్య పరిభాషలో స్ట్రెస్ యూరినరీ ఇన్‌కాంటినెన్స్ (ఎస్‌యూఐ) అంటారు. నాలుగేళ్లుగా ఇలాంటి సమస్యతో బాధపడుతున్న 40 ఏళ్ల మహిళకు అనంతపురంలోని కిమ్స్ సవీరా ఆస్పత్రి వైద్యులు విజయవంతంగా శస్త్రచికిత్స చేసి, ఆ సమస్యను పరిష్కరించారు. సాధారణంగా హైదరాబాద్, బెంగళూరు లాంటి పెద్ద నగరాల్లో అత్యంత సీనియర్ యూరాలజిస్టులు మాత్రమే చేసే ఇలాంటి శస్త్రచికిత్సలను ఇప్పుడు రాయలసీమలో కూడా అందుబాటులోకి తీసుకొచ్చారు. ఇందుకు సంబంధించిన వివరాలను కిమ్స్ సవీరా ఆస్పత్రికి చెందిన కన్సల్టెంట్ యూరాలజిస్టు డాక్టర్ నరేంద్రనాథ్ లోకారే తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుంతకల్లు ప్రాంతానికి చెందిన 40 ఏళ్ల మహిళ నాలుగేళ్లుగా ఎస్‌యూఐతో బాధపడుతోంది. ఈమెకు 15 సంవత్సరాల క్రితమే గర్భసంచి తొలగించారు (హిస్టరెక్టమీ). అయితే దిగువ మూత్రనాళ సమస్యకు సంబంధించిన లక్షణాలేవీ లేవు. ఇంతకుముందు ఆమె పలువురు యూరాలజిస్టులను కలవగా, వారంతా సంప్రదాయ చికిత్స చేశారు గానీ, దానివల్ల ఫలితం రాలేదు. దాంతో ఇటీవల ఆమె కిమ్స్ సవీరా ఆస్పత్రికి వచ్చారు. ఆమెకు అన్నిరకాల క్లినికల్, సిస్టోస్కోపిక్ పరీక్షలు చేయగా, ఎస్‌యూఐ సమస్య ఉన్నట్లు గుర్తించినట్లు తెలిపారు. దీంతో ఆమెకు సింథటిక్ మెష్ ఉపయోగించి మిడ్ యూరెత్రల్ స్లింగ్ రిపేర్ చేయాలని నిర్ణయించి ఇటీవలే టీఓటీ రిపేర్ విజయవంతంగా చేసినట్లు తెలిపారు. రాయలసీమలోని ఈ ప్రాంతంలో ఈ తరహా ఆపరేషన్ చేయడం ఇదే మొదటిసారి అన్నారు. శస్త్రచికిత్స అయిన ఒకరోజు తర్వాతే ఆమెకు ఫోలీస్ కేథటర్ తీసేశామన్నారు. తర్వాత కూడా రోగి బాగానే ఉన్నట్లు వివరించారు. ఆపరేషన్ తర్వాత ఆమెకు నియంత్రణ లేకుండా మూత్రవిసర్జన అన్న సమస్య ఇక లేదన్నారు.



పేదలకు నిత్యావసర సరుకులను పంపిణీ చేస్తున్న నిత్యసురభి ట్రస్టు ఛైర్‌పర్సన్ ఎస్.నిర్మలామురళి

నిత్యావసర సరుకులు పంపిణీ

ప్రజాశక్తి-అనంతపురం

రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని నిత్యసురభి ఛారిటబుల్ ట్రస్టు పుట్టినిల్లు ఆశ్రమం ఆధ్వర్యంలో నగరంలోని ఆదర్శనగర్‌లో ఉన్న ఆశ్రమంలో పేద ముస్లిం కుటుంబాలకు శనివారం నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ట్రస్టు ఛైర్‌పర్సన్ ఎస్.నిర్మలామురళీ మాట్లాడుతూ విద్యుత్ శాఖ విశ్రాంత ఉద్యోగుల రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ నబిరసూల్ సౌజన్యంతో 15 కుటుంబాలకు రూ.15 వేల ఖర్చుతో నిత్యావసరాలను అందించినట్లు తెలిపారు. ప్రతి ముస్లిం రంజాన్ పండుగను సంతోషంగా చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు కిష్టప్ప, కరిష్మా, అఖిల, కీర్తన, భాను, నసీమా, తదితరులు పాల్గొన్నారు.

జెఎన్‌టియు సిఎస్‌ఇ విభాగ అధిపతిగా భారతి

ప్రజాశక్తి-అనంతపురం



సిఎస్‌ఇ విభాగ అధిపతి డాక్టర్ కెఎఫ్ భారతిని అభినందిస్తున్న జెఎన్‌టియు సిబ్బంది

అనంతపురం జెఎన్‌టియు ఇంజినీరింగ్ కళాశాల సిఎస్‌ఇ విభాగ అధిపతి డాక్టర్ కెఎఫ్ భారతి శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి సిఎస్‌ఇ విభాగ అధిపతిగా అవకాశం కల్పించినందుకు ఉపకులపతి జి.రంగజనార్ధన, రెక్టార్ ఎం.విజయకుమార్, రిజిస్ట్రార్ సి.శశిధర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ నేతృత్వంలో ఇంజినీరింగ్ కళాశాల అభివృద్ధికి తనవంతు కృషి చేస్తామని తెలిపారు. అనంతరం విభాగం ఆచార్యులు ఎపి శివకుమార్, సురేష్‌కుమార్, ఈశ్వర్‌రెడ్డి, డాక్టర్ మాధవి పుష్పగుచ్చాలు అందజేసి అభినందనలు తెలిపారు.

ఎపిఇఎపి సెట్-2023 దరఖాస్తుల వెల్లువ

ప్రజాశక్తి-అనంతపురం

ఇంజనీరింగ్, ఫార్మాసీ, అగ్రికల్చర్, బిఎస్‌సి నర్సింగ్ (ఈఏపీసెట్-23) ప్రవేశాలకు విద్యార్థుల నుంచి దరఖాస్తుల వెల్లువ వస్తున్నట్లు ఎపిఇఎపి సెట్ కన్వీనర్ శోభాబిందు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం నాటికి 2,25,850 మంది దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు. 2022లో ఇంజినీరింగ్ విభాగంలో 2,06,579 మాత్రమే దరఖాస్తులు వచ్చాయన్నారు. విద్యార్థులకు ఇప్పటి వరకు పరీక్ష సెంటర్లకు ఇచ్చిన ప్రాధాన్యతలకు అనుగుణంగా పరీక్ష కేంద్రాలను మార్చినట్లు తెలిపారు. ఇది వరకే దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు మళ్లీ మరోసారి దరఖాస్తులను డౌన్లోడ్ చేసుకున్నట్లయితే వారి పరీక్ష కేంద్రాల వివరాలను తెలుసుకోవచ్చన్నారు.

ఇటుకలపల్లిలో పంటకోత ప్రయోగాలు



పంటకోత ప్రయోగాలు నిర్వహిస్తున్న అధికారులు

అనంతపురం : అనంతపురం రూరల్ మండలంలో ఇటుకలపల్లి గ్రామంలో శనివారం పంటకోత ప్రయోగం నిర్వహించారు. ఈమేరకు జిల్లా వ్యవసాయ అధికారి చంద్రానాయక్ ఆధ్వర్యంలో ఈశ్వర్‌రెడ్డికి చెందిన పొలంలో పంటను కోసి తూకం వేయగా 9.020 కిలోగ్రాముల దిగుబడి వచ్చినట్లు తెలిపారు. దీని ప్రకారం ఎకరాకు 8.72 క్వింటాళ్ల దిగుబడి వస్తుందని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి వెంకటేశ్వరప్రసాద్, వ్యవసాయ విస్తరణ అధికారి మురళి, ఎఎస్‌ఒ కళ్యాణి, విహెచ్ఎ హేమ, ఎంపిఇఒ అపర్ణ, సర్పంచి భాస్కర్‌రెడ్డి, వ్యవసాయ సలహా మండలి సభ్యులు శివారెడ్డి, పెద్దిరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకున్న జడ్జి దంపతులు



జడ్జి లావణ్య దంపతులకు పూర్ణకుంభంతో స్వాగతం పలుకుతున్న అర్చకులు

రాయదుర్గం రూరల్ : మండల పరిధిలోని మల్లాపురం లక్ష్మీనరసింహస్వామిని రాయదుర్గం జూనియర్ సివిల్ జడ్జి లావణ్య కుటుంబ సమేతంగా శనివారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ గౌరవాధ్యక్షులు శ్రీరామ్మూర్తి స్వామీజీ, ఆలయ ప్రధాన అర్చకులు సుబ్రహ్మణ్యం స్వామి జడ్జికి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం స్వామివారికి ప్రత్యేక పూజలు చేయించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు తిప్పేస్వామి, కోశాధికారులు సత్యనారాయణ, నర్సింహులు అకౌంటెంట్ వెంకటేశులు, కార్యదర్శి గురు రాఘవేంద్ర ప్రసాద్, గుర్నాథ్‌రెడ్డి, కమలాక్షుడు తదితరులు పాల్గొన్నారు.

జెఎన్‌టియు బీ.ఫార్మసీ ఫలితాలు విడుదల

అనంతపురం : అనంతపురం జెఎన్‌టియు పరిధిలో నిర్వహించిన బి.ఫార్మాసీ రెండవ సంవత్సరం ఒకటవ సెమిస్టర్ (ఆర్19) రెగ్యులర్ పరీక్ష ఫలితాలను శనివారం విడుదల చేసినట్లు డైరెక్టర్ అఫ్ ఎవాల్యు యేషన్ ఇ.కేశవరెడ్డి, కంట్రోలర్ అఫ్ ఎక్సామినేషన్ బి.చంద్రమోహన్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్షా ఫలితాల కోసం జెఎన్‌టియు వెబ్‌సైట్ http://jntuaresults.ac.inను సంప్రదించాలని కోరారు.

సిఎం పర్యటనను జయప్రదం చేయండి

ప్రజాశక్తి-అనంతపురం

వసతి దీవెన కార్యక్రమాన్ని ప్రారంభించేందుకు ఈనెల17న నార్పలకు రానున్నసిఎం జగన్ పర్యటనను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి పిలుపునిచ్చారు. శనివారం నగరంలోని తన స్వగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ శింగనమల నియోజకవర్గం నార్పల మండల కేంద్రానికి రానున్న సిఎం జగన్ పర్యటనకు జిల్లా నుంచి భారీగా తరలివచ్చి విజయవంత చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, వైసిపి ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రాయదుర్గం : సిఎం జగన్ జిల్లా పర్యటనను విజయవంతం చేయాలని విప్ విప్ కాపు రామచంద్రారెడ్డి పిలుపునిచ్చారు. శనివారం పట్టణంలోని రోడ్లు భవనాలు, అతిథి గృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈనెల17న సిఎం జగన్ నార్పలకు వస్తున్నందు నియోజకవర్గం నుంచి వైసిపి నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.

మట్టి నమూనాల సేకరణపై శిక్షణ

ప్రజాశక్తి-నార్పల

మండల కేంద్రంలోని రైతు భరోసా కేంద్రం-4లో మండలంలోని 16 రైతు భరోసా కేంద్రల సిబ్బందికి మండల వ్యవసాయ అధికారి ముస్తఫా ఆధ్వర్యంలో శనివారం మట్టి నమూనాల సేకరణపై ఒకరోజు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎఒ మాట్లాడుతూ రైతులు ప్రతి మూడు సంవత్సరాలకు ఒకసారి తప్పనిసరిగా భూసార పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. భూసార పరీక్షల ఆధారంగానే తగినంత మోతాదులో ఎరువులు వాడవచ్చ న్నారు. రైతు భరోసా కేంద్రం సిబ్బంది ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని రైతు సహకార సంఘం అధ్యక్షులు లోకనాథ్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎఇఒ శైలజ, రైతు భరోసా సిబ్బంది పాల్గొన్నారు.

బుక్కరాయసముద్రం : మండల వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ పెద్దకొండయ్య అధ్యక్షతన శనివారం మండల కేంద్రంలో నిర్వహించిన వ్యవసాయ సలహా మండలి సమావేశంలో మట్టి నమూనాల సేకరణపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎంపిపి దాసరి సునీత మాట్లాడుతూ రైతులు ప్రతి ఏడాది తప్పనిసరిగా మట్టి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. మట్టి పరీక్షల నివేదిక వచ్చిన తర్వాత అందుకు తగ్గ నమోదులోనే ఎరువులు వాడవచ్చన్నారు. ముఖ్యంగా వేసవిలో రైతులు మట్టి నమూనాలను ప్రయోగశాలకు పంపి వాటి ఫలితాలను రైతులకు అందజేయాలని ఆర్‌బికెలకు సూచించారు. జడ్పీటీసీ నీలం భాస్కర్, ప్రత్యేకాధికారిణి పిన్నేశ్వరి మాట్లాడుతూ మే నెల నుంచి రైతులకు ఎరువులు సరఫరా చేస్తామన్నారు. అనంతరం జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయాధికారి శ్రీనివాసులు మట్టి నమూనాల సేకరణపై ఆర్‌బికె ఇన్‌ఛార్జిలకు ప్రయోగాత్మకంగా వివరించారు. ఈ కార్యక్రమంలో ఉద్యాన అధికారి శైలజ, ఎంఐఎఒ హరిత, సర్పంచులు కుమారి, పార్వతి, రాము, దాసరి నారాయణస్వామి, రేకులకుంట లక్ష్మీనారాయణ, ఆర్‌బికె ఇన్‌ఛార్జిలు పాల్గొన్నారు.

పుట్లూరు : మండల కేంద్రంలోని భుమిరెడ్డి నారాయణరెడ్డి పొలంలో మట్టి నమూనా సేకరణపై రైతు భరోసా సహాయకులకు శనివారం శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా మండలస్థాయి వర్క్‌షాప్ ఎడిఎ చెంగల్‌రాయుడు ఆధ్వర్యంలో మట్టి నమూనా ఎలా తీయాలి, ల్యాబ్‌కు ఎలా పంపాలి, వాటి ఫలితాలను రైతులకు ఎలా తెలియజేయాలని అనే విషయాలపై వివరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారులు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

బెలుగుప్ప : భూసార పరీక్ష ఫలితాల ఆధారంగా ఎరువులు వేసుకుంటే పెట్టుబడి ఖర్చులు తగ్గుతాయని మండల వ్యవసాయ అధికారి పృథ్వీసాగర్ తెలిపారు. శనివారం మండల కేంద్రంలోని వ్యవసాయ కార్యాలయంలో భూసార మట్టి నమూనా సేకరణపై వ్యవసాయ సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాల్లో వ్యవసాయ సిబ్బంది రైతుల పొలాల్లో ఏవిధంగా మట్టి నమూనా సేకరించాలో వివరించారు. ఈ కార్యక్రమంలో అధికారులు భాగ్య, శిల్ప, ఎంపిఒలు పవన్‌కుమార్, తిమ్మారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

గుత్తి : పట్టణంలోని మండల వ్యవసాయ అధికారి కార్యాలయంలో మట్టి నమూనాల సేకరణ, భూసార పరీక్షలపై ఆర్‌బికె, విఎఎ, విహెచ్‌ఎ, విఎస్‌ఎ, ఎంపిఇఒలకు శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి ముస్తాక్ అహ్మద్ మాట్లాడుతూ రైతులు తమ పొలాల్లో భూసార పరీక్షలు చేయించుకోవడం వల్ల నేలలో ఉన్న పోషక పదార్థాల శాతం తెలుసుకోవడంతోపాటు ఎలాంటి ఎరువులు వేయాలో తెలుస్తుందన్నారు. కావున రైతులు తప్పనిసరిగా మట్టి పరీక్షలు చేయించుకోవాలని కోరారు. అనంతరం క్షేత్రస్థాయిలో రైతుల పంట పొలాల్లో మట్టి నమూనాలను ఎలా తీయాలో వివరించారు.


బుక్కరాయసమద్రంలో మట్టి నమూనాలను సేకరిస్తున్న అధికారులు

బొమ్మనహాల్ : మండలంలోని ఉద్దేహాల్ గ్రామంలో ఆర్‌బికెల సిబ్బందికి మట్టి పరీక్షలపై శనివారం ఒక్క రోజు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా వ్యవసాయ అధికారి అహ్మద్‌బాషా మాట్లాడుతూ ఆర్‌బికె సిబ్బంది రైతుల పొలాల్లో ఒక్కొక్క పొలంలో అరకిలో మట్టిని సేకరించి భూసార పరీక్షలకు పంపాలన్నారు. భూ పరీక్షలు చేయడం ద్వారా ఎలాంటి పంటలు వేయాలి, ఎరువులు ఎలా వాడాలో తెలుస్తుందన్నారు. ఈ కార్యక్రమానికి మండలంలోని వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



నార్పల, గుత్తిలో మట్టినమూనాపై అవగాహన కల్పిస్తున్న అధికారులు


రికార్డులు పరిశీలిస్తున్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ అనుపమ జేమ్స్

పెద్దకొట్టాలపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం తనిఖీ

ప్రజాశక్తి-ఉరవకొండ

విడపనకల్లు మండల పరిధిలోని పెద్దకొట్టాలపల్లి గ్రామంలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ అనుపమ జేమ్స్ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా స్థానిక వైద్యాధికారులు హరినాథ్‌రెడ్డి, శ్రీకాంత్‌బాబుతో కలిసి కోల్డ్‌చైన్ నిర్వహణ, రికార్డుల విధివిధానాలను పరిశీలించి సూచనలు, సలహాలు ఇచ్చారు. అలాగే ఆరోగ్య కేంద్రంలో చికిత్సలు తీసుకుంటున్న గర్భిణుల వివరాలను అడిగి తెలుసుకుని ప్రమాదకరంగా ఉన్న గర్భవతులకు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో వివరించారు. అనంతరం పౌష్టికాహారంతోపాటు అవసరమైన మందులు పంపిణీ చేయాలన్నారు. ఈకార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి తిరుపాల్‌నాయక్, ఆరోగ్య పర్యవేక్షకుడు నాగశంకర్, టీబీ సూపర్‌వైజర్ కుళ్లాయమ్మ, టీబీ మానిటరింగ్ ఆఫీసర్ మహేష్, వైద్యసిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పాఠశాల దినోత్సవ వేడుకలు

ప్రజాశక్తి-ఉరవకొండ

మండల పరిధిలోని చిన్నముష్టూరు ప్రాథమికోన్నత పాఠశాల దినోత్సవ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మండల విద్యాశాఖ అధికారి ఈశ్వరప్ప మాట్లాడుతూ విద్యార్థులు, ఉపాధ్యాయులు, గ్రామస్తులు కలిసి పాఠశాల దినోత్సవ వేడుకలు నిర్వహించడం శుభ పరిణామమన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు విజయలక్ష్మి, ఉపాధ్యాయులు రామకృష్ణ, రాజశేఖర్, బాలకృష్ణ, సదాశివ, ఆదిమూర్తి, వెంకటేశులు, సుశీల, జుబేదా, శ్వేత, మనోజ్, పేరెంట్స్ కమిటీ సభ్యులు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

పలువురు వైసిపిలో చేరిక

ప్రజాశక్తి-ఉరవకొండ

వజ్రకరూరు మండలం రాగులపాడుకు చెందిన 25 టిడిపి కుటుంబాలు శనివారం వైసిపిలో చేరాయి. ఈ సందర్భంగా శనివారం అనంతపురంలోని మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి నివాసంలో వైసిపి యువజన విభాగం జోనల్ ఇన్‌ఛార్జి వై.ప్రణయ్‌రెడ్డి వారికి వైసిపి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలోకి చేరిన వారిలో బోయ తిమ్మప్ప, బోయ పాండు, బోయ ఓబన్న, జింకల ఎర్రిస్వామి, బోయ సుధాకర్, బోయ రాజు, బోయ రామాంజనేయులు, బోయ అశోక్, బోయ లక్ష్మన్న, జింకల అశోక్, వడ్డే యువరాజు, తదితర కుటుంబాలు ఉన్నాయి. ఈకార్యక్రమంలో వజ్రకరూరు మండల నాయకులు వెంకటరెడ్డి, మధుసూధన్‌రెడ్డి, వీరాంజనేయులు, మాజీ ఎంపిటిసి రామాంజినేయులు, వార్డు సభ్యుడు రాముడెడ్డి, కురుబ గోపాల, వడ్డే రాజేంద్ర, తదితరులు పాల్గొన్నారు.


పార్టీలోకి చేరిన వారితో వైసిపి యువజన విభాగం జోనల్ ఇన్‌ఛార్జి వై.ప్రణయ్‌రెడ్డి

ముస్లిములకు ఇఫ్తార్‌విందు

ప్రజాశక్తి-శింగనమల

శింగనమలకు చెందిన కానిస్టేబుల్ మసూద్‌పీరా మండల కేంద్రంలోని మసీదులో ముస్లిములకు ఇఫ్తార్ విందు ఇచ్చారు. అలాగే రంజాన్ మాసంలో ఉపవాసం ఉన్నవారికి నమాజ్ చదుకునేందుకు రూ.45 వేల విలువజేసే కార్పెంట్ టోపీలు పంపిణీ చేయడంతోపాటు ఇఫ్తార్ విందు ఇచ్చారు. ఆశీస్సులతో తాను సుఖసంతోషాలతో ఉన్నాననికానిస్టేబుల్ మసూద్‌పీరా తెలిపారు. అంతేగాకుండా తనవంతు సాయంగా రంజాన్ మాసంలో ఉపవాసం ఉన్నవారికి తనవంతు సాయం చేసినట్లు తెలిపారు.


ఇఫ్తార్ విందులో పాల్గొన్నా ముస్లిములు

రాయదుర్గం : పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా ముస్లిములకు శనివారం ఇఫ్తార్ విందు ఇచ్చారు. పట్టణంలోని మక్కా మసీదు కాలనీకి సంబంధించిన యువకులు సుహేల్, సమీర్, అష్ఫాక్, నౌమన్, ముజ్జు, నాసిర్, అబ్దుల్ రౌఫ్, తదితర స్నేహితులు సుమారు 1200 మందికి ఇఫ్తార్ విందు ఇచ్చారు. ఈ సందర్భంగా పట్టణానికి చెందిన ముఫ్తి ముద్దసిర్ మాట్లాడుతూ ఉపవాసం ఉన్న వారికి ఖర్జూరంగానీ, ఒక గ్లాసు నీళ్లు గాని ఇచ్చినవారికి ఎంతో మేలు జరుగుతుందన్నారు.

ఉత్తమ సేవా పురస్కారానికి పుట్లూరు హెడ్ కానిస్టేబుల్

ప్రజాశక్తి-పుట్లూరు



ప్రభుత్వం ప్రతి సంవత్సరం ఉగాదికి అందించే ఉత్తమ సేవా పురస్కారానికి పుట్లూరు పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న హెడ్ కానిస్టేబుల్ లక్ష్మయ్య ఎన్నికయ్యారు. లక్ష్మయ్య ఉత్తమ ప్రతిభ కనబరిచినందుకు సేవా పతకానికి ఎంపికైనట్లు ఎస్ఐ వెంకటప్రసాద్ తెలిపారు. అవార్డు ఎంపికైనందుకు హెడ్ కానిస్టేబుల్ లక్ష్మయ్యను స్థానిక సిబ్బంది అభినందించారు.

ప్రధాని మోడీదాసుడు జగన్‌రెడ్డి

సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డి.జగదీష్

ప్రజాశక్తి-గుంతకల్లు

ప్రధాని మోడీ దాసుడు ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి అని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు డి.జగదీష్ విమర్శించారు. కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఏప్రిల్ 14 నుంచి 30వ తేదీ వరకూ సిపిఎం, సిపిఐ ఆధ్వర్యంలో చేపట్టిన ప్రచార భేరి కార్యక్రమంలో భాగంగా శనివారం పట్టణంలోని బీరప్ప గుడి సర్కిల్ నుంచి ఏర్పాటు చేసిన ర్యాలీని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోడీకి జగన్ దత్తపుత్రుడు మాదిరిగా వ్యవహరిస్తున్నాడని ఆరోపించారు. మోడీ రాష్ట్రానికి తీవ్రమైన అన్యాయం చేస్తున్నా జగన్‌రెడ్డి మాత్రం పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. ఇందులో భాగంగానే నిత్యం నరేంద్ర మోడీ చుట్టూ ప్రదక్షిణలు చేస్తుంటాడన్నారు. అంతేగాకుండా మళ్లీ ఇవిఎంలను ట్యాంపరింగ్ చేసి అధికారంలోకి వస్తామని ప్రధాని మోడీ, సిఎం జగన్ కలలు కంటున్నారన్నారు. ఈసారి వారి పప్పులు ఉడకవన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు దేవేంద్ర, రైతుసంఘం జిల్లా అధ్యక్షుడు బి.గోవిందు, సిపిఐ నియోజక వర్గ కార్యదర్శి వీరభద్రస్వామి, పట్టణ కార్యదర్శి గోపీనాథ్, మండల కార్యదర్శి రాముడాయల్, తదితరులు పాల్గొన్నారు.


ర్యాలీలో పాల్గొన్న సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డి.జగదీష్

వాల్మీకులను ఎస్టీల్లో చేర్చొద్దు..

కళ్యాణదుర్గం : వాల్మీకులను ఎస్టీల్లో చేర్చవద్దని హరిత దివ్యాంగుల సేవాసమితి రాష్ట్ర అధ్యక్షుడు బీ.మోహన్‌నాయక్ విజ్ఞప్తి చేశారు. ఈమేరకు శనివారం స్థానిక కార్యాలయంలో తహశీల్దార్ శ్రీనివాసులుకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజనులు ఇప్పటికీ అడవుల్లో నివాసం ఉంటూ విద్య, వైద్య, ఉద్యోగ, ఉపాధి అవకాశాల్లో వెనుకబడి ఉన్నారన్నారు. ఈనేపథ్యంలో అన్నిరంగాల్లో అభిబుద్ధి చెందిన వాల్మీకులను ఎస్టీల్లో చేరిస్తే గిరిజనులు తీవ్రంగా నష్టపోతారన్నారు. కావున వెంటనే వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చే నిర్ణయాన్ని వెనక్కి తీసుకునేందుకు కృషి చేయాలని కోరారు.